క్లుప్తంగా

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

లోకేశ్వరం: మండలంలోని నగర్‌తండాలో రాథోడ్ సర్దార్‌కు చెందిన ఎద్దు విద్యుదాఘాతంతో గురువారం మృతి చెందింది. రైతు గ్రామ సమీపంలోని తన చేనులోకి ఎద్దును మేత కోసం తోలుకెళ్లాడు. అక్కడ ఎద్దు మేస్తూ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. ఎద్దు విలువ రూ.60 వేలు ఉంటుందని..ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు వేడుకున్నాడు. డిప్యూటీ తహసీల్దార్ రవీందర్ ఘటనా స్థలానికి వెళ్లి పంచనామా నిర్వహించారు.

ఫిర్యాదుదారులతో మర్యాదగా నడుచుకోవాలి



డీఎస్పీకి మొక్క అందిస్తున్న ఎస్సై కృష్ణసాగర్

కడెం: పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో సిబ్బంది మర్యాదగా నడుచుకోవాలని నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం కడెం పోలీస్‌స్టేషన్‌ను డీఎస్పీ గంగారెడ్డి సందర్శించారు. ఈసందర్భంగా ఇటీవల నమోదైన కేసుల వివరాలు తెలుసుకున్నారు. పోలీస్‌స్టేషన్ నిర్వహణను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ప్రతిభ కనబరిచిన సిబ్బందిని అభినందించి రివార్డులు అందజేశారు. కార్యక్రమంలో సీఐ సైదారావు, ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

బస్‌పాస్‌లు అందజేత

సారంగపూర్: మండలంలోని జామ్‌లో ఆర్టీసీ నిర్మల్ డీఎం ప్రతిమారెడ్డి ఆదేశాల మేరకు విలేజ్ బస్ అధికారి టీవీ రమణారెడ్డి గురువారం దివ్యాంగుల బస్‌పాస్ మేళా నిర్వహించారు. ఈసందర్భంగా 40మంది దివ్యాంగులకు 50శాతం రాయితీపై బస్‌పాస్‌లు అందించారు. ఆయన మాట్లాడుతూ దివ్యాంగులు ఎక్స్‌ప్రెస్, డీలక్స్, పల్లెవెలుగు బస్సుల్లో 50శాతం రాయితీపై ప్రయాణించవచ్చని పేర్కొన్నారు. మేనేజర్ ఏఆర్‌రెడ్డి, వీడీసీ సభ్యులు, మీసేవా నిర్వాహకులు సందీప్, రవికుమార్ తదితరులు ఉన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న క్లబ్ సభ్యులు

నిర్మల్‌టౌన్: క్యాన్సర్‌పై అవగాహన పెంచుకోవాలని కంటి వైద్యులు కృష్ణంరాజు అన్నారు. గురువారం నిర్మల్‌లోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా క్యాన్సర్‌పై అవగాహన కల్పించే పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

చెక్కులు అందజేత

లోకేశ్వరం: మండలంలోని ధర్మోర గ్రామానికి చెందిన భట్టు ధర్మన్నకు రూ.37వేలు, మడాబోయిన మోహన్‌కు రూ.60వేల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు మంజూరయ్యాయి. గురువారం వారి లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి బీజేపీ నాయకులు చెక్కులు అందజేశారు. సంజీవ్‌రెడ్డి, అనిల్, సాహేందర్, సాయాగౌడ్, మంద భాస్కర్, గుండోల్ల నవీన్ తదితరులు ఉన్నారు.


స్వయంఉపాధి పొందాలి



టీ పాయింట్ ప్రారంభోత్సవంలో నేతలు

ఖానాపూర్: ఇందిరా మహిళా శక్తి పథకం పేరిట అందిస్తున్న రుణాలను అర్హులు సద్వినియోగం చేసుకొని స్వయంఉపాధి పొందాలని మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం అన్నారు. ఈ పథకం కింద రూ.2లక్షల రుణం పొంది ఏర్పాటు చేసిన టీ పాయింట్‌ను చైర్మన్ ప్రారంభించారు. కార్యక్రమంలో కిశోర్‌నాయక్, పరిమి సురేశ్, నిమ్మల రమేశ్, నేరెళ్ల సత్యనారాయణ, జహీర్, సురేశ్ తదితరులు ఉన్నారు.

సైన్సుపై ఆసక్తి పెంచుకోవాలి



నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్, సిబ్బంది

లోకేశ్వరం: విద్యార్థులు సైన్సుపై ఆసక్తి పెంచుకోవాలని ప్రిన్సిపాల్ గౌతమ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీవీ రామన్ జయంతి నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు చిన్నయ్య, విఠల్, వినోద్‌కుమార్, ప్రవీణలక్ష్మి, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, మహేందర్, సాయినాథ్, నవీన్, హరీశ్ తదితరులున్నారు.

రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

కడెం: రైతుల సంక్షేమమే రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. గురువారం మండలంలోని ఉడుంపూర్ గ్రామంలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని.. సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఏ గ్రేడ్ రకం వరికి క్వింటాలకు రూ.2320, బీ గ్రేడ్ రకం వరికి రూ.2300 చెల్లించి కొనుగోలు చేస్తుందన్నారు. రైతులు దళారులను నమ్మి మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల వద్దే పంటను అమ్ముకోవాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కడెం: ఉడుంపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

ముధోల్: మండలంలోని రువ్వి గ్రామంలో గురువారం వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్‌రావుపటేల్ ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లాలాబాయి గౌతమ్, రాంరెడ్డి, రాంనాథ్‌నాయక్, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ స్టిక్కర్ అతికించాలి

- డీపీవో శ్రీనివాస్
- కొనసాగుతున్న కుటుంబ సర్వే ప్రక్రియ

మామడ: ప్రతి ఇంటికి స్టిక్కర్ అతికించాలని డీపీవో శ్రీనివాస్ అన్నారు. మండలంలోని పొన్కల్ గ్రామంలో సమగ్ర కుటుంబ గణన సర్వేను గురువారం పరిశీలించి మాట్లాడారు. సర్వేలో అన్ని వివరాలు నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం శివారులో నిర్మించిన సెగ్రిగేషన్‌షెడ్డు, శ్మశానవాటిక, క్రీడాప్రాంగణం నిర్వహణను పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజేశ్వర్‌రెడ్డి ఉన్నారు.

కుంటాల: సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీవో లింబాద్రి, ఎంపీవో రహీంఖాన్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని పలు గ్రామాల్లో సిబ్బంది అతికిస్తున్న స్టిక్కర్లను పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శులు, ఎన్యూమరేటర్లు ఉన్నారు.

ఖానాపూర్: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను సిబ్బంది పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీవో రత్నాకర్‌రావు అన్నారు. గురువారం మండలంలోని సుర్జాపూర్, మేడంపల్లి, హరిజనవాడ, కొత్తవాడ, బుడగజంగం వాడ తదితర కాలనీల్లో ఇంటింటి సర్వేను పర్యవేక్షించారు. ప్రతీ ఇంటికి స్టిక్కర్ అతికించాలని సిబ్బందికి సూచించారు. ఖానాపూర్



పొన్కల్‌లో సర్వే పరిశీలిస్తున్న డీపీవో శ్రీనివాస్

లోని ఏడో వార్డు పరిధిలో సర్వేను కౌన్సిలర్ కిశోర్ నాయక్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మంజుల, నిమ్మల రమేశ్, నేరెళ్ల సత్యనారాయణ, నయీం, సురేశ్ తదితరులున్నారు.

సోన్: సమగ్ర సర్వేలో భాగంగా ఇళ్లకు వచ్చే ఎన్యూమరేటర్లకు ప్రజలు సహకరించాలని ఎంపీఓ ఖలీల్ హైమద్ కోరారు. ఈ సందర్భంగా లోకల్ వెల్మల్, సిద్దులకుంట, మాదాపూర్, పాక్‌పట్ల, గాంధీనగర్ గ్రామాల్లో ఇళ్లకు అతికించే స్టిక్కరింగ్ ప్రక్రియను పరిశీలించారు. కార్యక్రమంలో కార్యదర్శులు జయలక్ష్మీ, సంగీత, రాజలింగం, స్వరూప, చంద్రభూషన్‌రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తానూరు: సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీవో అబ్దుల్ సమద్ సూచించారు. గురువారం మండలంలోని కోలూరులో ఎన్యూమరేటర్లు ఇళ్లకు స్టిక్కరింగ్ అతికించడాన్ని పర్యవేక్షించారు.



కుంటాల: పెంచికల్‌పాడ్‌లో..



ఖానాపూర్ : సర్వే పరిశీలిస్తున్న ఎంపీవో రత్నాకర్

వారి వెంట ఏపీవో గంగాధర్ తదితరులు ఉన్నారు.

సారంగపూర్: సర్వేలో భాగంగా ఎన్యూమరేటర్లు మండలంలోని ఆయా గ్రామాల్లో ఇళ్లకు స్టిక్కర్లను అతికించారు. సర్వేకు వచ్చే అధికారులకు వివరాలు చెప్పడంతోపాటు పట్టాదారు పుస్తకాలు ఆధార్, ఇతర వివరాలు దగ్గర ఉంచుకోవాలని సూచించారు. ఇళ్లకు స్టిక్కర్లు అంటించే ప్రక్రియను తహసీల్దార్ శ్రీదేవి పర్యవేక్షించారు.

పాఠశాలల్లో చెకుముకి పోటీలు

లక్ష్మణచాంద: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు చెకుముకి టాలెంట్ టెస్టులు నిర్వహిస్తున్నట్లు ఆ పోటీల జిల్లా కన్వీనర్ నారాయణవర్మ అన్నారు. గురువారం మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి పోటీలు నిర్వహించారు. పాఠశాలల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు ఈనెల 21న మండలస్థాయి పోటీల్లో పాల్గొంటారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాజునాయక్, ఉపాధ్యాయులు వినోద్‌కుమార్, సురేశ్, అశోక్, హంసలత తదితరులు పాల్గొన్నారు.

తానూరు: మండలంలోని ఎల్వి జిల్లా పరిషత్ పాఠశాలలో చెకుముకి పోటీలు నిర్వహించారు. సీవీ రామన్ జయంతి పురస్కరించుకొని విద్యార్థులకు చెకుముకి పోటీలు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి హెచ్‌ఎం శంకర్ పేర్కొన్నారు. సైన్స్ ఉపాధ్యాయులు పి.మాధవ్‌రావ్, డి.సుదర్శన్, భూమన్నయాదవ్, రజనీకాంత్, సుజితాదేవి, రవీందర్, లక్ష్మి, శిరీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



లక్ష్మణచాందలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్, సత్తనపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లల్లో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి పోటీలు నిర్వహించారు. 8, 9, 10వ తరగతి విద్యార్థులకు సామాన్య, సాంఘిక, భౌతికశాస్త్రం విషయాలపై 40 ప్రశ్నలతో పరీక్ష నిర్వహించారు. కార్యక్రమాల్లో హెచ్‌ఎంలు నరేందర్‌రావు, వాల్గోట్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నర్సాపూర్(జి): విద్యార్థులకు సైన్స్‌పై ఆసక్తిని పెంచేందుకు చెకుముకి పోటీలు దోహదం చేస్తాయని ఇన్‌చార్జి హెచ్‌ఎం శ్రీనివాస్ అన్నారు. మండలంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 8,9,10వ తరగతి



ఖానాపూర్ : సత్తనపల్లిలో..



తానూరు: ఎల్విలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

విద్యార్థులకు జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి పోటీలు నిర్వహించారు. ఉపాధ్యాయులు రఫీక్, లక్ష్మినారాయణ, దుర్గ, దీవెన పాల్గొన్నారు.

నిర్మల్‌లో అరుదైన ఆపరేషన్

- 150 గ్రాముల రాయిని తీసిన వైద్యులు
- ఆరోగ్యశ్రీలో ఉచితంగా శస్త్రచికిత్స

నిర్మల్: ఆరోగ్యశ్రీ ద్వారా పేదలకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తూ.. హైదరాబాద్ స్థాయిలో చేసే అరుదైన శస్త్రచికిత్సలను జిల్లాకేంద్రంలోనే అందిస్తున్నారు. నిర్మల్‌లోని స్వప్న ఆస్పత్రిలో గురువారం జరిగిన అరుదైన ఆపరేషన్ వివరాలను జనరల్ సర్జన్ నాళం శశికాంత్ వివరించారు. ఖానాపూర్‌కు చెందిన నర్సవ్వ కొన్ని నెలలుగా మూత్రసంచిలో రాయితో బాధపడుతోంది. వివిధ ఆస్పత్రులు తిరిగినా నయం కాలేదు. తెలిసినవారి సూచన మేరకు స్వప్న మల్టీస్పెషాలిటీ ఆసుపత్రికి రాగా.. ఇక్కడ యూరాలజిస్ట్ మల్లేశ్ పరీక్షించి మూత్రసంచిలో రాయి ఉన్నట్లు గుర్తించారు. ఆరోగ్యశ్రీ కింద ఆస్పత్రిలోనే శస్త్రచికిత్స చేసి సుమారు 150 గ్రాముల రాయిని తొలగించారు. నర్సవ్వ ప్రస్తుతం ఆరోగ్యంగా ఉందని డాక్టర్ శశికాంత్ వివరించారు.



నర్సవ్వకు ఆపరేషన్ చేసి తొలగించిన రాయిని చూపుతున్న వైద్యులు

'కులగణన చరిత్రాత్మక నిర్ణయం'

లక్ష్మణచాంద: రాష్ట్రంలో చేపడుతున్న బీసీ కులగణన ఒక చరిత్రాత్మక నిర్ణయమని నిర్మల్ ఏఎంసీ వైస్ చైర్మన్ ఈటెల శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ఇంటింటి సర్వేకు ప్రజలు సహకరించాలని కోరారు. బీసీల కులగణన పూర్తయితే రాష్ట్రంలోని బీసీ బిడ్డలకు లాభం చేకూరుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సిరిపురం నాగేశ్, కాంగ్రెస్ బీసీ విభాగం మండలాధ్యక్షుడు ముద్రబోయిన వినేశ్, బిట్లింగ్ రజనీకాంత్, సమ్మెట రవి, గంగయ్య పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలి

ఖానాపూర్: హెచ్‌ఐవీ రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఖానాపూర్ ప్రభుత్వ ఆస్పత్రి ఐసీటీసీ కౌన్సిలర్ రాంచందర్ అన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఆశవర్కర్ల దినోత్సవం పురస్కరించుకుని సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. హెచ్‌ఐవీపై ఉచిత సేవల కోసం 1097 టోల్‌ఫ్రీ నంబర్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో సీహెచ్‌వో మీరాబాయి, హెల్త్ సూపర్‌వైజర్లు ప్రేమలత, సరస్వతి తదితరులు ఉన్నారు.

అమరవీరుల ఆశయ సాధనకు కృషి

ఖానాపూర్: భూమి కోసం భుక్తి కోసం దేశ ప్రజల విముక్తి కోసం పోరాడి అమరులైన వీరుల ఆశయ సాధనకు కృషి చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్లైన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి నంది రామయ్య అన్నారు. గురువారం పట్టణంలోని విశ్రాంతిభవనం ఆవరణలో అమరవీరులకు పార్టీ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు అంకుశ్‌రావు, రాజన్న, ఎల్లయ్య, గోరెబాయ్, భీంరావు, జైతు, సుంగు తదితరులు ఉన్నారు.



ర్యాలీగా వస్తున్న నంది రామయ్య, నాయకులు

కల్లూరు చేరిన పాదయాత్ర

కుంటాల: దత్త జయంతి పురస్కరించుకొని నిర్మల్ గండి రామన్న సాయిబాబా ఆలయం నుంచి బుధవారం షిర్డీకి చేపట్టిన భక్తుల పాదయాత్ర గురువారం రాత్రి కుంటాల మండలం కల్లూరు చేరింది. సాయిబాబా ఆలయంలో పూజల అనంతరం బస చేశారు. వీరిని ఆలయ కమిటీ సభ్యులు అభినందించారు. పాదయాత్రలో సాయి భక్తులు పూదరి నరహరి, రాజేశ్, నారాయణరెడ్డి, హరి, రేణుకా దాస్, మనోహర్, దేవేందర్ రెడ్డి పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు

కుంటాల: మండలంలోని కల్లూరు, ఓలా, కుంటాల గ్రామాల్లో గురువారం బీజేపీ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఆ పార్టీ మండల కన్వీనర్ సూర్యవంశీ సాయి ఆధ్వర్యంలో 100 సాధారణ సభ్యత్వాలు పూర్తి చేసినట్లు గుద్దేటి నర్సయ్య తెలిపారు. అశోక్‌కుమార్, మాజీ ఎంపీటీసీ కట్టరవి, పసుల నవీన్, దత్తుపటేల్, పవన్, సాయినాథ్ పటేల్, సాయి పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు

కుంటాల: కుంటాల సృజన విద్యాలయం పాఠశాలలో శ్రీ సరస్వతి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీరామచంద్ర రామానుజ జీయర్ శిష్యులు శ్రీమాన్ టీకే.రామకన్నన్ స్వామి ఆధ్వర్యంలో సంకల్పం, విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, మత్సంగ్రహణం, అంకురార్పణ, అగ్నిప్రతిష్ఠ, హవనం, అదివాసం పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కొత్తకాపు గంగన్న, వైద్యుడు చింతపండు రవి–సృజన, విజయ్–సునంద, అర్చకులు అచ్యుత్ రామన్, వర్షిత్, గోపాల్, భక్తులు పాల్గొన్నారు.

'రాహుల్‌గాంధీపై వ్యాఖ్యలు సరికాదు'

కడెం: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై.. నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు సరికాదని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పొద్దుటూరి సతీశ్ రెడ్డి అన్నారు. గురువారం కడెంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పదేళ్లు కాంగ్రెస్‌లో ఉన్న మహేశ్వర్‌రెడ్డికి రాహుల్‌గాంధీ కులం గుర్తుకు రాలేదని.. బీజేపీలో చేరితేనే కులం, మతం గుర్తుకు వస్తున్నాయని ఎద్దేవా చేశారు. మహేశ్వర్‌రెడ్డికి రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి గురించి మాట్లాడే అర్హత లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు భూషణ్, రమేశ్, శ్రీనివాస్, మల్లేశ్, బొడ్డు గంగన్న, లక్ష్మణ్, సలీం, రాజేశ్వర్‌రెడ్డి, రహీం, షరిఫొద్దీన్, సత్యంచారి, ధర్మయ్య తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న సతీశ్‌రెడ్డి

చేపపిల్లలు పంపిణీ

ముధోల్: మండల కేంద్రంలోని ప్రజాపరిషత్ కార్యాలయంలో ఫిషరీష్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ విజయ్‌కిరణ్‌కర్ మత్స్యకారులకు చేపపిల్లలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకారుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మండలంలోని 19 గ్రామపంచాయతీల పరిధిలోని 69 చెరువుల్లో 15.18లక్షల చేపపిల్లలను పంపిణీ చేశామన్నారు. మిగిలిన మత్స్యకారులకు అధికారుల నుంచి ధ్రువపత్రం తీసుకొస్తే వారంరోజుల్లో చేపపిల్లలు అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మత్స్యకారుల సంఘం సభ్యులు ఫీల్డ్‌మెన్ కె.రాజేందర్ తదితరులున్నారు.

సోన్: మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న మత్స్యశాఖ సొసైటీ సభ్యులకు వందశాతం రాయితీపై చేపపిల్లలు పంపిణీ చేసినట్లు మత్స్యశాఖ అధికారి గయాసుద్దీన్ తెలిపారు. ఈసందర్భంగా 2024–25 ఆర్థిక సంవత్సరానికి సోన్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో మండలంలోని మత్స్యశాఖ సొసైటీ సభ్యులకు సుమారు 2.43లక్షల చేపపిల్లలు పంపిణీ చేశారు. అనంతరం వీటిని 14 చెరువులు, కుంటాలలో గురువారం వదిలారు. సొసైటీ సభ్యులు, మత్స్యశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ముధోల్‌లో చేపపిల్లలు పంపిణీ చేస్తున్న అధికారి

'ప్రభుత్వ ఉపాధ్యాయుడి సస్పెన్షన్ ఎత్తివేయాలి'

భైంసాటౌన్: దిలావర్‌పూర్ మండలం నుంచి ఇథనాల్ పరిశ్రమను తరలించాలని అక్కడి రైతులు చేస్తున్న ఉద్యమానికి మద్దతు తెలిపిన ప్రభుత్వ ఉపాధ్యాయుడిపై సస్పెన్షన్ ఎత్తివేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ ముష్కం రామకృష్ణ గౌడ్, లస్మన్న గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రైతులు, ప్రజలకు ఇథనాల్ పరిశ్రమతో తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. అక్కడి రైతులు ధర్నాలు, దీక్షలకు సామాజిక బాధ్యతతో మద్దతు ఇస్తే ప్రభుత్వ వ్యతిరేక చర్యగా భావించి సస్పెండ్ చేయడం సరికాదని.. సస్పెన్షన్‌ను రద్దు చేయాలని కోరారు.

ధాన్యం తూకం వేయాలని నిరసన

- 20 రోజులుగా గోస పడుతున్నామంటున్న అన్నదాతలు

లోకేశ్వరం: కొనుగోలు కేంద్రంలో నిర్ణీత తేమశాతం వచ్చిన వరి ధాన్యాన్ని వెంటనే తూకం వేయాలని రైతులు డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని అబ్దుల్లాపూర్ ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులు నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా రైతులు మాట్లాడుతూ అబ్దుల్లాపూర్‌లోని కొనుగోలు కేంద్రానికి 25 రోజుల కిందట వరిధాన్యం తీసుకొచ్చామన్నారు. నిబంధనల ప్రకారం తేమశాతం వచ్చినా.. కాంటా పెట్టడం లేదని వాపోయారు. తూకం వేయకపోవడంతో కేంద్రంలో ధాన్యం నిల్వలు పెరిగిపోయాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని రైతులు వేడుకుంటున్నారు.



అబ్దుల్లాపూర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

బండ్లబాటకు మరమ్మతులు

ముధోల్: మండల కేంద్రం నుంచి వ్యవసాయ భూములకు వెళ్లే రోడ్డుకు గురువారం మరమ్మతులు నిర్వహించారు. 15 ఏళ్ల కిందట ఈ రోడ్డు ఏర్పాటుకు భూమిపూజ చేసినా ఇప్పటికీ పనులు ప్రారంభించలేదు. దీంతో వ్యవసాయ భూములకు వెళ్లేందుకు రైతులు ఇబ్బంది పడుతున్నారు. గ్రామానికే చెందిన గడ్డం సుభాశ్ తన సొంత ఖర్చులు వెచ్చించి పొక్లెయిన్ సాయంతో ఈ రోడ్డుకు మరమ్మతులు చేయించారు. దీంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు.



మట్టిరోడ్డు ఏర్పాటు చేయిస్తున్న రైతు

గుంతలరోడ్లపై జరభద్రం..!



కమల థియేటర్ సమీపంలో కల్వర్టుపై గుంత

భైంసాటౌన్: పట్టణంలో చేపట్టిన మిషన్ భగీరథ పనులతో అంతర్గత రోడ్లు గుంతలు తేలి ప్రమాదకరంగా మారాయి. పైపులైన్లకు మరమ్మతులు చేయించేందుకు గుంతలు తవ్విన నిర్వాహకులు.. కొన్నిచోట్ల పూడ్చడం మరిచిపోయారు. ఫలితంగా వాహనదారులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. పట్టణంలోని కమల థియేటర్ సమీపంలో నడిరోడ్డుపై కల్వర్టు వద్ద ఏర్పడిన గుంతను ఇప్పటికీ పూడ్చలేదు. ద్విచక్రవాహనదారులు గుంత గమనించక ప్రమాదాల బారిన పడుతున్నారు. చాలా చోట్ల కల్వర్టులపై గుంతలు ఉండగా..సీసీ రోడ్లు కంకరతేలి గుంతలతో అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేయించి సమస్య పరిష్కరించాలని వాహనదారులు కోరుతున్నారు.



ఓవైసీనగర్‌లో గుంతలతో సీసీ రోడ్డు

పూజలు

కుంటాల: మండలంలోని కల్లూరు సాయిబాబా ఆలయంలో గురువారం భక్తులు పూజలు నిర్వహించారు. హారతి కార్యక్రమంలో భక్తులు హాజరై బాబాను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.